బుజ్జితల్లీ.. ఐలవ్యూ



ప్రేమ..ఎంత చిన్న పదం!
ఎంత పెద్ద భావం!
ఎంత మంది ఎన్ని యుగాల నుంచి
ఆ జాజిపూల వానలో తడిసి
ముద్దయిపోయుంటారు?
ఎంత మంది ఆ రంగు కలల్లో
మెరిసిపోయి ఉంటారు?
అంతా ప్రేమే. ఈ సృష్టికి మూలం ప్రేమే..
మనిషికి అందం ప్రేమే..

ఓ బాలసుబ్రహ్మణ్యం గళం ప్రేమ.
ఓ వేటూరి కలం ప్రేమ.
ఓ ఇళయరాజా స్వరం ప్రేమ.
ఓ బాపు కుంచె దిద్దిన రంగుల చిత్రం ప్రేమ.
అందుకే ప్రేమ ఎప్పటికీ పదిలం..
ప్రేమ..రెండు అక్షరాలేకాదు..రెండు హృదయాలు గుండె చప్పుడు..నేడు చాలా మంది ప్రేమ వివాహాలు చేసుకుని ఎంతో సంతోషంగా జీవితాన్ని ఆస్వాదిస్తున్నారు. పరిణితి చెందిన ప్రేమికులు..ప్రేమ లోతుల్లో విహరిస్తున్నారు. -బీచ్‌రోడ్డు

ఒకరికొకరుగా...



చిన్నప్పటి నుంచి కలిసే ఉన్నాం..మాలో ఎప్పుడు ప్రేమ మొదలైందో కూడా తెలియదు. మా మనసులు కలిశాయి..మా ప్రేమను అర్థం చేసుకుని మా పెద్దలు పెళ్లి చేశారు. చాలా హ్యాపీగా ఉన్నాం. పెళ్లై నాలుగేళ్లు అవుతోంది. ఒకరికొకరం గౌరవించుకుంటాం..ప్రేమ పంచుకుంటాం..అదే మా సక్సస్ లైఫ్. -శ్రీను, నందిని, విశాఖ

ఎనిమిదేళ్ల ప్రేమ



మేం ఎనిమిదేళ్ల నుంచి ప్రేమించుకున్నాం. మాకు ప్రేమికుల రోజు అంటూ ప్రత్యేకం ఏమీ ఉండదు. ఒకరికొకరం నిరంతరం ప్రేమించుకుంటూనే ఉంటాం. మా ప్రేమను అర్థం చేసుకుని ఇరుకుటుంబాలు గత ఏడాది పెళ్లి చేశారు. మేం ఎంతో ఆనందంగా ఉన్నాం. -అభిషేక్, రమ్య, విశాఖ

కలకాలం ప్రేమించాలి



మేమిద్దరం ఒకే కార్యాలయంలో ఉద్యోగం చేసేవాళ్లం. అలా పరిచయం ఏర్పడింది. స్నేహం మొదలైంది...అది కాస్తా ప్రేమగా మారింది. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రాణం. ఇంట్లోవాళ్లను ఒప్పంచి రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాం. ప్రేమించడం గొప్పకాదు..ప్రేమను కలకాలం నిలుపుకోవడం గొప్ప. -సాయి, రామలక్ష్మి, విశాఖ

ఏయూను సందర్శించిన సంగీత దర్శకుడు సాలూరి



సాలూరిని సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని తెలుగు సినీ సంగీత దర్శకుడు సాలూరి వాసురావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణ్ రావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ తరఫున సాలూరు వాసు రావును సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఆచార్య డి.నగ రాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సిటీపోలీస్ జట్టు విజయం

విశాఖ స్పోర్ట్స్: వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ లీగ్‌లో భాగంగా జింక్‌గ్రౌండ్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్ జట్టుపై సిటీపోలీస్ జట్టు ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన ఇన్‌కమ్‌ట్యాక్స్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసింది.రాజేంద్ర 23 పరుగులు చేశాడు. కేశవ మూడు, శ్రీను,అప్పన్న చెరో రెండేసి వికెట్లు తీశారు. ప్రతిగా సిటీ పోలీస్ నాలుగు వికెట్లు కోల్పోయి 12.3 ఓవర్లలోనే విజయలక్ష్మానికి చేరింది. సంతోష్ 26 పరుగులు చేయగా త్రినాథ్ 50 పరుగులతో నిలిచాడు.

క్లుప్తంగా

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి స్కిల్ డెవెలప్‌మెంట్ సెంటర్ నిర్వహిస్తున్న ఉచిత టైరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. విశాలాక్షినగర్ రామాలయంలో ప్రాంగణంలో శ్రీ సత్యసాయి జిల్లా సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు జ్యోతి వెలిగించి శిక్షణను ప్రారంభించారు.శ్రీ సత్యసాయి బాబా వారి శతజయంతి ఉత్సవాలలో భాగంగా మహిళల ఆర్థిక పురోగతికి బాటలు వేసేందుకు ఈ ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి రాష్ట్ర స్కిల్ డెవెలప్‌పెంట్ విభాగం మహిళా సమన్వయకర్త అమ్మాజీ, పురుషుల విభాగం సమన్వయకర్త సత్యనారాయణ, సంస్థ సిటీ కన్వీనర్ డీవీవీ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఎన్ఎస్‌యూ ఫ్లోరిడా ప్రతినిధులు



రిజిస్ట్రార్ ధనుంజయరావుతో చర్చిస్తున్న ఫ్లోరిడా ప్రతినిధులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నోవా సౌత్ ఈస్టన్ యూనివర్సిటీ (ఎన్.ఎస్.యు) అసిస్టెంట్ డైరెక్టర్, జోసెఫ్ స్లిబాతో కూడిన బృందం గురువారం సందర్శించింది. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న నూతన కోర్సులు ప్రత్యేకమైన అంశాలను పరస్పరం వివరించారు.

అకాడమీ పాఠ్య పుస్తకం ఆవిష్కరణ

విశాఖ విద్య: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలుగు , సంస్కృ అకాడమీ, ఇటీవలే రెగ్యులర్ బీఈడీ ఉపాధ్యాయ విద్యార్థులకు డీఎస్సీ ఉపాధ్యాయ పోటీ పరీక్షల కోసం వివిధ పుస్తకాలను ప్రచురించింది. ఇందులో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయ దూర విద్యా విభాగం సహాయ ఆచార్యుడు డా. కనకల జయరాం సహరచయితగా ఉన్న బీఈడీ తృతీయ సెమిస్టర్‌కు సంబంధించి ఆంగ్ల మాధ్యమ పాఠ్య పుస్తకాన్ని ఏయూవీసీ ఆచార్య శశిభూషణరావు గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కిషోర్ బాబు, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహరావు, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య విజయ్ మోహన్, సంగీత దర్శకులు సాలూరి వాసురావు పాల్గొన్నారు.

విపత్తుల నివారణపై పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్ : విపత్తుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉభయ గోదావరి జిల్లాల్లో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ 'పారా' రూపొందించిన పుస్తకాన్ని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గురువారం ఆవిష్కరించారు. ఇటువంటి పుస్తకాలు రూపొందిస్తున్న పారా సంస్థను మేయర్ అభినందించారు. బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, పారా సంస్థ ప్రతినిధి అద్రూస్, స్వాతంత్ర్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎల్‌పీ కుమార్, డాక్టర్ శీతల్ పాల్గొన్నారు.

కుంతీ మాధవ స్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వచ్చే నెల 9 నుంచి 15 వరకు జరగనున్న అనంతుని కల్యాణోత్సవాల్లో భక్తులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని ఈవో నానాజీ బాబు అన్నారు. కల్యాణోత్సవాల నిర్వహణపై కుంతీ మాధవ స్వామి ఆలయంలో గురువారం భక్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9న పుష్ప యాగం, 10న శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు కల్యాణం, 12న తెప్పోత్సవం, 13న రథోత్సవం, 14న డోలా మండపానికి స్వామి వేంచేయుట, 15న పుష్ప యాగం జరుగుతుందన్నారు.

సరోజినినాయుడు నారీ లోకానికి స్ఫూర్తి



మాట్లాడుతున్న ఆచార్య సీతామాణిక్యం

విశాఖ విద్య: విశిష్ట కవయిత్రి, స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజిని నాయుడును స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ మహిళా ముందుకు సాగాలని ఏయూ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య కే. సీతా మాణిక్యం అన్నారు. సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని డాక్టర్ దుర్గాబాయి దేశ్ ముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, ఆంధ్రా యూనివర్సిటీతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా హాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతా మాణిక్యం మాట్లాడుతూ బ్రిటిష్ వారి నుంచి భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మొదటి మహిళల్లో సరోజినీ నాయుడు ఒకరన్నారు. ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ టి.నాగభూషణం, డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, డాక్టర్ కె.పల్లవి, డాక్టర్, పి.ఉష, డాక్టర్ రవి, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ సాంబశివరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనలు భావితరాలకు దిక్సూచి కావాలి

విశాఖ విద్య: పరిశోధనలు భావితరాలకు దిక్సూచిగా నిలువాలని ఏయూ రిజిస్ట్రార్ ఎస్.ధనుంజయరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల బయో టెక్నాలజీ విభాగ పరిశోధక విద్యార్థిని యేనుగుపల్లి విజయశ్రీ చేసిన పరిశోధనలకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఈ ఎస్ ధనుంజయ్ రావు చేతులమీదుగా ఆమె పీహెచ్ డీ పట్టా పొందారు. 'గ్రీన్ సింథసిస్ అండ్ కేరెక్టరైజేషన్ ఆఫ్ మాగ్నీషియమ్ ఆక్సైడ్ నానో పార్టికల్ విత్ ఏస్ ఎంఫాసిస్ ఆన్ ది ఎఫెక్ట్ ఆఫ్ సీడ్ జర్మినేషన్, ఫిషియోలాజికల్, బయో మోలెక్యులర్ అండ్ ప్రోటీఓమిక్ రెస్పాన్సస్ ఇన్ రెడ్ చిల్లీ కల్టివేర్స్' అనే అంశంపై విజయశ్రీ పరిశోధనలు చేశారు. బయో టెక్నాలజీ విభాగ ప్రొఫెసర్ ఆచార్య జి. సుధాకర్ పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా విజయశ్రీను ఆచార్యులు పరిశోధకులు విద్యార్థులు అభినందించారు.

చిరు వ్యాపారులను తొలగించడం దుర్మార్గం



జీవీఎంసీ ప్రధాన గేటు వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

సీతమ్మధార : పూర్ణా మార్కెట్ రోడ్డు మార్జిన్‌లో జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అండగా నిలవాలని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం చిరు వ్యాపారులు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పూర్ణా మార్కెట్ వద్ద రోడ్లపై గంపలు, తోపుడుబండ్లపై పండ్లు, పువ్వులు వగైరా వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారులను పోలీసులు అక్కడి నుంచి పూర్తిగా తొలగించడం దుర్మార్గమన్నారు. పూర్ణా మార్కెట్ జీవీఎంసీ ఆధీనంలో ఉందని, అటువంటప్పుడు అక్కడి వ్యాపారులపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే కౌన్సిల్‌లో తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. అటువంటిది ఏమీ లేకుండా పోలీసులు జోక్యం దేనికని ఆయన ప్రశ్నించారు. చిరు వ్యాపారులను అక్కడి నుంచి తొలగించాలంటే, అదే ప్రాంతంలో ప్రత్యామ్నాయ స్థలాన్ని వారికి కేటాయించాలని, వెండర్ జోన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చిరు వ్యాపారులను కొందలు, భూములు ఆక్రమణదారులుగా, దొంగలుగా భావించడం సరికాదన్నారు. పేదల పక్షాన ఉంటానని హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చినప్పటి నుంచి చిరు వ్యాపారులపై దాడులు పెరిగాయని సీపీఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు ఆరోపించారు. చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని నగర పోలీస్ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రాలు సమర్పించామని, నేడు జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ఔషధాల తయారీలో జాగ్రత్తలు అవసరం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్ : వైద్య రంగంలో ఔషధాల తయారీలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. స్థానిక కాలేజీలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో రిజిస్టర్డ్ ఫార్మాసిస్టులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఔషధాల వినియోగంలో వాటి ప్రతి చర్యలపై ప్రతి ఫార్మాసిస్టుకు అవగాహన ఉండాలన్నారు. కృత్రిమ మేధను అవగాహన చేసుకోవాలన్నారు. పాలిటెక్నిక్‌లోని ఫార్మసీ కాలేజీ అధ్యాపకుడు జి.సాయిరాజేష్ 40 మంది ఫార్మాసిస్టులకు శిక్షణ ఇచ్చారు. ఫార్మా కోవిజిలెన్స్ కేస్ ప్రాసెసింగు విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడు విలియం కేరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి



ప్రిన్సిపాల్ మంజులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

దాబాగార్డెన్స్ : విద్యకు, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని, ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యార్థినుల వసతి గృహాన్ని గురువారం ఆయన సందర్శించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికయ్యే విధంగా సిద్ధం చేయాలని సూచించారు. వసతి గృహంలో ఉండే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. అనంతరం కృష్ణా కళాశాలను సందర్శించి అక్కడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణానగర్ ఏరియాలో గల మలేరియా నియంత్రణ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులు గమనించారు. పర్యటనలో కలెక్టర్ వెంట సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, ఇతర అధికారులు ఉన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట : మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు ఎక్కువ కేసులు వచ్చేలా వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ సూచించారు. గురువారం జిల్లా కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజా న్యాయపీఠం అధ్యక్షుడు వల్లభ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్ కైలాసగిరి ఫీడర్ పరిధిలో విద్యుత్ విభాగం అధికారులు శుక్రవారం విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీపీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, బి.ఎస్.ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన తెలిపారు.

19, 20 వార్డుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎంవీపీకాలనీ: తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని వాల్తేర్ డిపో, జాలరిపేట, వీఎంఆర్‌డీఏ పార్క్, ఈస్ట్‌పాయింట్ కాలనీ, డిఫెన్స్ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. వీఎంఆర్‌డీఏ పార్క్ 11 కేవీ ఫీడర్ నిర్వహణలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు గురువారం తెలిపారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో రేపు రక్తదాన శిబిరాలు

ఎంవీపీకాలనీ: విశాఖపట్నంలోని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం మెగా ఉచిత రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు క్లబ్ ఎంవీపీ శాఖ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ కళాశాలలో పాటు నగరంలోని 15 చోట్ల ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నగరంలో అందిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా 1000 యూనిట్లు రక్తసేకరణే లక్ష్యంగా ఏకకాలంలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పద్యనాటక ప్రదర్శన నేడు

మురళీనగర్ : సాయ కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాధవధార మాధవ సమాజం భవనంలో భక్త ప్రహ్లాద పద్యనాటకం శుక్రవారం ప్రదర్శిస్తారని సొసైటీ అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు. ఈ మేరకు ఆ రోజు సాయంత్రం నంది అవార్డు గ్రహీత బగాది విజయసారథి హిరణ్య కశిపుడిగా, ప్రహ్లాదుడిగా చిరంజీవి జాహ్నవి లక్ష్మీదేవి నటిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల నటుడు మెడికల్ డిపార్టుమెంటు చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శంకర్‌ను సత్కరిస్తామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న క్రైం సీఐ శ్రీనివాస్

మల్కాపురం : ఇటీవల కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై కంచరపాలెం క్రైం పోలీసులు విద్యార్థులకు జిల్లా కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రైం సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలు, సెల్‌ఫోన్లు, బైక్‌లు, బంగారం, వెండి వంటి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా పదవుల్లో ఏడుగురికి అవకాశం



నడింపల్లి కృష్ణంరాజు | మువ్వల సురేష్ | ఉమ్మడి దాస్ | సత్య శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం | పతివాడ కనకరాజు



సత్యనారాయణ | పల్లా దుర్గారావు

ఆరిలోవ: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో తూర్పు నియోజకవర్గానికి చెందిన ఏడుగురికి పదవులు లభించాయి. వీరిలో 15వ వార్డుకు చెందిన నడింపల్లి కృష్ణంరాజును పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమించారు. 20వ వార్డుకు చెందిన మువ్వల సురేష్‌ను జనరల్ సెక్రటరీగా, 9వ వార్డుకు చెందిన ఉమ్మడి దాస్, 17వ వార్డుకు చెందిన ఎస్.సత్య శ్రీనివాస్ సుబ్రహ్మణ్యంను సెక్రటరీ ఆర్గనైజేషనల్‌గా, 10వ వార్డుకు చెందిన పతివాడ కనకరాజు, 13వ వార్డుకు చెందిన ఇమంది సత్యనారాయణను సెక్రటరీ యాక్టవిటీగాను, 28వ వార్డుకు చెందిన పల్ల దుర్గారావును అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా నియమించారు. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా పదవులకు న్యాయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాయని తెలిపారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



దుర్గాబాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఆచార్య సీతా మాణిక్యం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. సీతామాణిక్యం పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్ల ప్రణాళికను సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: మాస్టర్‌ప్లాన్ రహదారుల అభివృద్ధి ప్రణాళికను సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గురువారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రణాళిక, సాంకేతిక విభాగాలపై సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి వివిధ అంశాలపై సందేహాలు ఉంటే రెవెన్యూ సిబ్బంది సహకారంతో నివృత్తి చేసుకొని ఖరారు చేయాలని సూచించారు. ముందుగా నిర్దేశించుకున్న సమయం ప్రకారం ముందుకు సాగాలని, ఎటువంటి అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు. అనంతరం నిర్వహించిన సాంకేతిక విభాగం సమీక్షలో ఎంఎల్‌సీపీ, యూహెచ్3హెచ్ హెలికాఫ్టర్ మ్యూజియం, చీమలాపల్లి, ఎండాడ కన్వెన్షన్ సెంటర్ల పనులను సత్వరమే పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని నిర్దేశించారు. సమావేశంలో ప్రధాన ఇంజనీర్ వి.వినయ్ కుమార్, ఎస్ఈ భవానీశంకర్, సీయూపీ శిల్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిద్ర సుఖమెరుగదు...



నిద్ర సుఖమెరుగదు...ఆకలి రుచి ఎరుగదు అనేది నానుడి. అలసిన శరీరానికి రాళ్ల కుప్పయినా మెత్తటి పాన్పుగా మారిపోతుంది. బీచ్‌రోడ్డులో భవన నిర్మాణం కోసం తీసుకువచ్చిన ఇటుకల లోడులో నిద్రిస్తున్న కార్మికుడు కనిపించాడు. బాహ్య ప్రపంచంతో సంబంధం లేదన్న విధంగా హాయిగా సిమెంట్ ఇటుకలపై నిద్రించాడు.

-ఏయూక్యాంపస్/ ఫొటో :సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం